ప్రజాశక్తి
గురువారం 9 ఫిబ్రవరి 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

కప్పేసి...ఆక్రమించేసి....

- కలెక్టర్ పెట్టించిన బోర్డులకే దిక్కులేదు..
- ఎండాడలో పర్యాటక స్థలాల కబ్జా
- రూ.వందల కోట్ల విలువైన గెడ్డలపై భవనాలు



ఆక్రమించి నిర్మించిన భవన సముదాయం

కలెక్టర్ పేరుతో ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

"తాంబూలాలిచ్చాం... తమ పనైపోయిందనే'లాగ రెవెన్యూ అధికారుల వ్యవహారం ఉంది. నగరంలోని చెరువులు, గెడ్డలు, ప్రభుత్వ స్థలాల్లో స్వయంగా జిల్లా కలెక్టర్ పెట్టిన బోర్డులకూ దిక్కులేకుండా పోతోంది. బోర్డులు పెట్టేసి తమ పనైపోయిందనుకుంటున్నారు. తర్వాత ఆ స్థలాలు ఆక్రమణలకు గురైనా పట్టించుకోవడం లేదు. ఎండాడ, రుషికొండ ఏరియాలో 'రియల్ ఎస్టేట్, రాజకీయ నాయకుల ధన దాహానికి ప్రభుత్వ చెరువులు, వాగులు, గెడ్డలన్నీ గురవుతున్నాయి. తాజాగా వాటిపై భారీ భవనాలు వెలస్తున్నాయి. ఈ కబ్జారాయుళ్ల ఆగడాలకు కళ్లెం వేయలేని స్థితిలో రెవెన్యూ యంత్రాంగం ఉంది. రూ.వందల కోట్ల విలువైన స్థలాలను పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ యజమానులూ కాజేస్తున్నారు.

నీరు ప్రవహించే మార్గాలన్నీ బంద్...

దేశంలోని బెంగళూరు, హైదరాబాద్, చెన్నయ్, ముంబయి వంటి మహానగరాల్లో వర్షాలు, తుపాన్లు సందర్భంగా ఎలాగైతే కకావికలమైనాయో భవిష్యత్‌లో విశాఖ నగరంలోని సాగర తీరానికి అదే గతిపడుతుందంటూ పర్యావరణ వేత్తలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఎండాడలో గల వాగులు, చెరువులు, గెడ్డలన్నిటినీ గడచిన కొద్దిరోజులుగా కప్పేసి తమ ఆధీనంలోకి తెచ్చుకుని భారీ భవనాలు, అపార్టుమెంట్లను, విల్లా మోడల్స్‌లో నిర్మాణాలు చేసేస్తున్నారు. సముద్రంలోకి ప్రవహించాల్సిన వాగులకు అడ్డుకట్ట వేసినట్టుగా అయ్యింది. సర్వే నెంబరు 100లో కొన్ని స్థలాలు ఇప్పటికే ఎండాడలో కబ్జాకు గురయ్యాయి. ఈ మిగతా 2లో..


హెటిరోపై పెరుగుతున్న నిరసన

- పైపులైను అనుమతులపై అభ్యంతరం
- ఉపసంహరించుకోవాలని కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శికి లేఖ
- ఆందోళనకు అండగా రాజయ్యపేట పంచాయతీ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

హెటిరో డ్రగ్స్ కంపెనీకి కొత్తగా పైప్‌లైన్ అనుమతులు మంజూరుచేయొద్దని 2021 డిసెంబరు 1 నుంచి ఆందోళన చేపడుతున్న మత్స్యకారులకు ప్రజల మద్దతు పెరుగుతోంది. పైప్‌లైన్ ఏర్పాటుకు గత నెల 11న జారీచేసిన కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్‌జెడ్) అనుమతుల ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాజయ్యపేట పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు మంగళవారం కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. మత్స్యకార గ్రామాలైన రాజయ్యపేట, బోయపాడు, పెదతీనార్ల, చినతీనార్ల, దొండవాక, అమలాపురం, డిఎల్‌పురం, బంగారయ్యపేట, మత్స్యకారులు కొత్త పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనను పట్టించుకోకుండా అనుమతులు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజయ్యపేట సర్పంచ్ పి.అప్పలసర్స, నక్కపల్లి జెడ్‌పిటిసి సభ్యులు గోసల కాసులమ్మ, ఎంపిటిసి సభ్యులు పిక్కి ముసలమ్మ, పంచాయతీ వార్డు సభ్యులు మైలపల్లి మహేష్‌బాబు, మైలపల్లి లోవలక్ష్మి, జామి రమణమ్మ, పిక్కి కామేశ్వరరావు, ఎస్.అప్పలనర్స, వి.సీత, పిక్కి అప్పలరాజు, పిక్కి కొండలరావు, మఠం గోవిందమ్మ, పిక్కి సత్తిబాబు కార్యదర్శికి పంపిన అభ్యంతర లేఖపై సంతకాలు చేశారు. సముద్ర తీరానికి అతిసమీపంలో అనుమతుల్లేకుండా నిర్మించిన డిశాలినేషన్ ప్రాజెక్టులు నిర్మించిన హెటిరోపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

'హెటిరో డ్రగ్స్ కంపెనీ ఉత్పత్తి ప్రారంభించినప్పటి నుంచి కనీస పర్యావరణ నిబంధనలు పాటించకుండా సముద్రంలోకి రసాయన వ్యర్థాలు విడిచిపెట్టడంతో సమీప మిగతా 2లో..



కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ కార్యదర్శికి పంపిన లేఖపై స్థానికుల సంతకాలు

అర్చకునిపాలెం ఘటనలో బాధ్యులపై చర్యలు : ఆర్‌జెడి జ్యోతీకుమారి

▶ వార్త 8లో..

ముడసర్లోవ భూముల ప్రయివేటీకరణ ఆపాలి : సిపిఎం పాదయాత్ర

▶ వార్త మెయిన్ 3లో..

ప్రభుత్వానికి భూములిచ్చేందుకు ససేమిరా!

▶ వార్త 4లో..

సమగ్రశిక్ష అధికారులపై చర్య తీసుకోవాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం



ప్రజాశక్తి-విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వైసిపి మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని కోరుతూ కస్తూరిబా పాఠశాలల సిబ్బందికి దసపల్లా హోటల్‌లో మీటింగ్ ఏర్పాటుచేసిన సమగ్ర శిక్ష అధికారులు విసిడిఒ టి.వెంకటలక్ష్మి, ఎంఐఎస్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ శ్రీలక్ష్మి పట్ల చర్యలు తీసుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్‌చేశారు. ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు దసపల్లా హోటల్‌లో సమావేశం ఉందని, డిఇఒ హాజరయ్యే ఈ సమావేశానికి అందరూ రావాలని, లేకుంటే చర్యలు ఉంటాయని కస్తూరిబా పాఠశాలల సిబ్బంది వాట్సప్ సందేశాలు పంపారని తెలిపారు. అయితే ఈ సమావేశానికి సీతంరాజు సుధాకర్ హాజరై తన అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని కోరారని పేర్కొన్నారు. అధికార పక్షం తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని, ఇది కొనసాగితే నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగవని తెలిపారు. ఓటర్లను ప్రలోబాలకు గురిచేసి గెలవాలనుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనిచేయడమేనని పేర్కొన్నారు. దీనిపై విచారించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎపి ఎన్నికల కమిషన్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు పంపించినటు లోకనాథం తెలిపారు.

ధాన్యం అమ్మకానికి రైతుల అవస్థలు..

- భీమిలి మండలంలో 800 టన్నుల సేకరణ
- డబ్బుల కోసం తప్పని ఎదురు చూపులు
- కాటా వద్ద నిరీక్షణ



ధాన్యం లోడుతో కాటా వద్ద నిరీక్షిస్తున్న రైతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : కారణాలు ఏమైనా గానీ ధాన్యం అమ్మకంలో రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలో డిసెంబర్ 1న ప్రారంభమైన ధాన్యం సేకరణ ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ ప్రక్రియ ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగే అవకాశం ఉంది.

ధాన్యం శాంపిల్స్ సేకరణ ఇలా..

మండలంలోని తాటితూరు, మజ్జివలస క్లస్టర్లలో ధాన్యం శాంపిల్స్ సేకరిస్తారు. ఆయా రైతు భరోసా కేంద్రాల క్లస్టర్ల పరిధిలో ఉన్న గ్రామాల రైతులు ధాన్యం నాణ్యతను నిర్ధారించుకునేందుకు కిలో ధాన్యం తీసుకెళ్తారు. తేమ శాతం 17 శాతం లోపు ఉండాలి. ధాన్యం తడిగా ఉన్న, రంగు మారిన ధాన్యం 5 శాతం కంటే తక్కువ, ధాన్యం పరిపక్వత 3 శాతం కంటే తక్కువ ఉండాలి. తడి, రంగు మారిన ధాన్యం శాంపిల్స్ సేకరణలో ఇబ్బందులు ఉంటే, ఎండ బెట్టి మరలా ఆర్‌బికె కేంద్రానికి శాంపిల్ తీసుకెళ్లే వెసులుబాటు ఉంది. తాటితూరు క్లస్టర్‌కు (ఆర్‌బికె కేంద్రానికి) తాటితూరు, టి.నగరపాలెం, చిప్పాడ, తాళ్ళవలస, సంగివలస, చిట్టివలస, తగరపువలస గ్రామాల రైతులు శాంపిల్స్ తీసుకెళ్తారు. మజ్జి వలస క్లస్టర్‌కు మజ్జివలస, దాకమర్రి, మజ్జిపేట, సింగన బంద, మూలకుద్దు తదితర గ్రామాల రైతులు శాంపిల్స్ తీసుకెళ్తారు. రైతు, ధాన్యం వివరాలను ఆర్‌బికె కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పొందుపరుస్తారు. టెక్నికల్ అసిస్టెంట్ శాంపిల్స్ సేకరిస్తారు. రూట్ ఆఫీసర్ కాటా ఎక్కడ వేసేదీ, మిల్లు వివరాలు చెబుతారు. కాటాకు, మిల్లుకు ధాన్యం ఎప్పుడు తీసుకెళ్లాలనే షెడ్యూల్ ఇస్తారు.

కాటా వద్ద నిరీక్షణ

రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఆనందపురం మండలం వేములవలస కాటా వద్దకు వెళ్తున్నారు. అక్కడ కాటా వేసేందుకు గంటలు, రోజుల తరబడి ఉండాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇందుకు కారణం లేక పోలేదు. కాటా వేసిన ధాన్యానికి ధర ఇవ్వాల్సిన అమౌంట్ సంబంధిత బ్యాంక్‌లో అప్పటికే మిల్లర్ సరిపడా మిగతా 2లో..

భమిడిపాటి సేవలు మరవలేనివి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : సమాచార శాఖలో వివిధ హోదాలలో విధులు నిర్వహించిన భమిడిపాటి జగన్నాధరావు సేవలు మరువలేనివని సమాచార శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్ అన్నారు. ఈ నెల 6వ తేదీన మృతిచెందిన భమిడిపాటి జగన్నాధరావుకు సంతాప సూచికగా బుధవారం సాయంత్రం సమాచార శాఖలో సభ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మణిరామ్ మాట్లాడుతూ 1984 నుంచి ఆరు సంవత్సరాలు విశాఖ జిల్లాలో వివిధ హోదాలలో విధులు నిర్వహించిన అనంతరం ప్రమోషన్‌పై గవర్నర్ ప్రెస్ సెక్రటరీగా వెళ్లారని తెలిపారు. సమాచార శాఖలో జాయింట్ డైరెక్టరుగా పనిచేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రాంతీయ ఉప సంచాలకులు పి.గోవిందరావు, పూర్వ సహాయ సంచాలకులు ఆర్. త్యాగరాజు, సమాచార శాఖ సూపరింటెండెంట్ జివికెఎస్.ప్రసాదు, ఎఇఐఇ సిహెచ్.మల్లికార్జునరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు విదేశీ విద్య దూరం : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పేద విద్యార్థులకు విదేశీ విద్యను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం దూరం చేసిందని టిడిపి విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ ఆరోపించారు. ఈ మేరకు టిడిపి నాయకులు బుధవారం కలెక్టరేట్‌కు వెళ్లి డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు పాలనలో 4,923 మంది పేద విద్యార్థులు విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పిస్తే జగన్మోహన్‌రెడ్డి పాలనలో 213 మందికి మాత్రమే అవకాశం దక్కిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా విదేశీ విద్యా పథకానికి వైసిపి ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించిదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి లోడగల కృష్ణ, చిక్కాల విజయ్‌బాబు, విల్లూరి చక్రవర్తి, గొల్లంగి ఆనంద్‌బాబు, కోనేటి సురేష్, వలిశెట్టి తాతాజీ, తమ్మిన విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీపై నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఫీజుల పేరుతో విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసి ఆత్మహత్యలు చేసుకునే విధంగా ప్రేరేపిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్, విశాఖ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ, అనంతపురం జిల్లాలోని నారాయణ కళాశాలలో చదువుతున్న భవ్యశ్రీకి ఫీజు కట్టాలని లేకపోతే రికార్డులు ఇవ్వబోమని భయభ్రాంతులకు గురిచేయడంతో ఆ అమ్మాయి కళాశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. కొన్ని నెలల క్రిందట విశాఖ పరిధి పరదేశిపాలెంలోని నారాయణ కళాశాల హాస్టల్లో ఒక అబ్బాయి ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. రెండు వారాల క్రింద జివిఎంసి 4వ వార్డులోని శ్రీ చైతన్య రెసిడెన్షియల్ హాస్టల్లో ఒక అమ్మాయి చనిపోయిందన్నారు. ఆయా ఘటనల్లో అధికారులను బదిలీ చేస్తున్నారు తప్ప కళాశాలల యాజమాన్యాలపై ఎటువంటి చర్యలూ లేవన్నారు. విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు.

మొదటి పేజీ తరువాయి..

కప్పేసి.. ఆక్రమించేసి...

ప్రదేశంలోనే ఉన్న ఎపి టూరిజం శాఖకు చెందిన స్థలాలూ కబ్జా అయినా ఆ శాఖ అధికారులు గుడ్లప్పగించి చూస్తున్నారు. మొత్తంగా 4 ఎకరాల వరకూ ఈ ప్రదేశంలో వాగు ప్రవహించేది. ఈ స్థలం అంతా తాజాగా కబ్జాకు గురైంది. ఎండాడ ప్రాంతంలో (సాగర తీరానికి అభిముఖంగా) పలు నూతన భవనాలు ఇలా నిర్మించబడుతున్నాయి. పేరుమోసిన రియల్టర్లు ఇక్కడ గెడ్డలు, చెరువులన్నిటినీ కప్పేశారు. జివిఎంసి టౌన్‌ప్లానింగ్ ఎలా ఇస్తుందో? రెవెన్యూ బోర్డులు పెట్టి చేతులు కట్టుకుని ఎందుకు కూర్చొందో వారికేతెలియాలి.

ప్రభుత్వానిది సెంటు కూడా కబ్జా కానివ్వమన్న నేతలెక్కడ?

రాజధాని వస్తున్న నేపథ్యంలో 'ప్రభుత్వానికి చెందిన సెంటు భూమి కూడా కబ్జా కానివ్వమనే అధికార పార్టీ పెద్దలు ఎక్కడున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పైపెచ్చు ఈ ప్రాంతంలోనే వారు కూడా స్థలాలు కొనుక్కోవడం విశేషం. ఆసియాలోనే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో విశాఖకు మంచి స్థానం ఉంది. ప్రభుత్వ రంగ సంస్థలైన పోర్టు, స్టీల్‌ప్లాంట్, తూర్పునౌకాదళం వంటి ప్రతిష్టాత్మక సంస్థలు ఉండడం ఒక కారణం కాగా, తొలినుంచీ విశాఖపట్నం వ్యాపార, వాణిజ్యరంగాలకు పెట్టింది పేరు. ఎపి రాజధాని విశాఖే...అని సిఎం వైఎస్ జగన్ స్వయంగా తాజాగా ప్రకటన చేయడంతో తీర ప్రాంతంలో రియల్ ఎస్టేట్ మదుపరులు పూర్తిస్థాయిలో తిష్ట వేసి ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసేస్తున్నారు. ముందుగా ఒకటి, అరా జిరాయితీ భూములను కొనడం, అటుపక్కగా ఉండే చెరువులు, గెడ్డలు, పారే వాగులన్నిటినీ కప్పేయడం వీరికి రివాజుగా మారిపోయింది. గెడ్డలను కప్పేసి వారి వారి అపార్టుమెంట్లకు అప్రోచ్ రోడ్లను వేసేసుకుంటున్నారు. ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లో స్థలాలకు బహిరంగ మార్కెట్‌లో గిరాకీ ఉండడంతో కబ్జాకోర్ల కళ్లు ఇక్కడే కేంద్రీకృతమైనాయి. ఇది ఆక్రమణ...అన్న దానికి ఆనవాళ్లే లేకుండా చదును చేసేసి కొత్తగా భవంతుల నిర్మాణాలు చేసేస్తున్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో ప్రముఖ స్థానంలో ఉన్న ఒకరు ఇక్కడ కొంత స్థలాన్ని కొనుగోలు చేశారు. కానీ ప్రభుత్వ గెడ్డలు, వాగులు కబ్జాలకు గురైన విషయం తెలుసుకోలేక పోవడం లేదా తెలిసినా మిన్నకుండడం విస్మయం కలిగిస్తున్న విషయం. జివిఎంసి అధికారులు దిగువ శ్రేణి సిబ్బందికి అన్నీ తెలిసినా పెద్దోళున్నారు మనకెందుకు? అన్న రీతిలో కబ్జాకోర్లకు కొంతమంది లొంగిపోయి తమ చేయి తడిస్తే చాలు అనుకుంటున్నారు.

ధాన్యం అమ్మకానికి రైతుల అవస్థలు

డిపాజిట్ చేసి ఉండాలి. బ్యాంకర్ భరోసా ఇస్తేనే రైతు తీసుకెళ్లిన ధాన్యం కాటా వేస్తారు. ఈ ప్రక్రియలో జాప్యం వల్లనే కాటా వద్ద రైతులు నిరీక్షించాల్సి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

800 టన్నుల ధాన్యం సేకరణ

తాటితూరు క్లస్టర్ పరిధిలో 2022 డిసెంబర్ 1 నుంచి 2023 ఫిబ్రవరి 4 వరకు 84 మంది రైతుల నుంచి 322.50 టన్నులు, మజ్జి వలస క్లస్టర్ పరిధిలో 105 మంది రైతుల నుంచి 477.50 టన్నుల ధాన్యం, మొత్తంగా 800 టన్నుల ధాన్యం సేకరణ జరిగింది. కాటా వేసిన తర్వాత ధాన్యాన్ని అమ్మేందుకు రైతులు ఆనందపురం మండలం సొంత్యాం, పద్మనాభం మండలం పాండ్రంగి మిల్లుల వద్దకు వెళ్తున్నారు.

సోనా మసూరి, సాంబ మసూరి, ఆర్‌జిఎల్ రకాల ధాన్యం (ఎ గ్రేడ్) క్వింటాలు ధర రూ.2060, ఎంటియు 1121 రకం (సాధారణ రకం) రూ.2040 గా ప్రభుత్వం ప్రకటించింది.

ట్రాక్టర్ అద్దె , గోనె సంచుల అమౌంట్‌పై అయోమయం

ట్రాక్టర్ అద్దె, గోనె సంచులకు సంబంధించి డబ్బులు ఇవ్వలేదు. వీటి చెల్లింపుల్లో అయోమయం నెలకొంది. ట్రాక్టర్ రోజు అద్దె రూ.800. కాటా వద్ద ధాన్యం బస్తాల లోడుతో రోజంతా ఉన్నాం. ధాన్యం ఇచ్చి సుమారు నెల రోజులు అయింది. ఇంకా అమౌంట్ అందలేదు.



ఆకిరి శంకరరావు
రైతు, తాటితూరు

డబ్బులు ఇంకా రాలేదు

100 క్వింటాళ్ల సాధారణ రకం ధాన్యం 10 రోజుల క్రితం ఇచ్చాను. క్వింటాలు ధర రూ.2040. ఇంకా అమౌంట్ నా బ్యాంక్ ఖాతాలో వెయ్యలేదు. కాటా వద్ద ధాన్యం బస్తాల లోడుతో ఒక రోజంతా ఉండాల్సి వచ్చింది.



తమ్మిన వెంకటరమణ
రైతు, టి.నగరపాలెం

మరో 250 టన్నుల ధాన్యం సేకరణ

ఇప్పటి వరకు 800 టన్నుల ధాన్యం సేకరణ జరిగింది. మరో 250 టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నాం. ధాన్యం సేకరణ, కొనుగోలులో తలెత్తుతున్న ఇబ్బందులు తాత్కాలికమే. వాటిని కూడా అధిగమించే ప్రయత్నం చేస్తున్నాం. ధాన్యం కొన్నాక సుమారు మూడు వారాల్లోగా సంబంధిత రైతు బ్యాంక్ ఖాతాలో డబ్బు జమ అవుతుంది. ఏ ఒక్క రైతు కూడా ఆందోళన చెందనక్కరలేదు.



బి.శివకోమలి
వ్యవసాయాధికారి
భీమునిపట్నం మండలం

'విశాఖ రాజధాని సరైన నిర్ణయమే'

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే విశాఖను రాజధాని చేయడమే సరైన నిర్ణయమని నవ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఊదరగొండి చంద్రమౌళి అన్నారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్రీకృత రాజధాని వల్ల హైదరాబాదును కోల్పోవడంతో జరిగిన నష్టం అందరికీ తెలిసిందేనన్నారు. శ్రీకృష్ణ కమిటీ కూడా కేంద్రీకృత రాజధాని సరికాదని చెప్పిందని గుర్తుచేశారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి జరిగే విధంగా మూడు రాజధానులు అవసరం ఉందన్నారు.

కృత్రిమ చేతుల పంపిణీ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రైల్వే న్యూ కాలనీలోని విశాఖ సేఫ్టీ కౌన్సిల్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో బ్యాటరీతో పనిచేసే కృత్రిమ చేతులను వికలాంగులకు జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి బుధవారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మనిషి దేహంలో ప్రతి అవయవమూ ప్రధానమైనదేనన్నారు. వివిధ ప్రమాదాలలో ఎంతోమంది తమ అవయవాలను పోగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయని, అలాంటి వారి జీవితాలలో వెలుగు చూపిస్తున్న రోటరీ క్లబ్, ఇనాలి ఫౌండేషన్, కరూర్ వైశ్య బ్యాంక్ కృషి అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 25 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు. మరో 11 మందికి కొలతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, అనిల్ చద్ద, ఇనాలి ఫౌండేషన్ క్యాంప్ లీడర్ బి.అనికేత్, విజెఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

'హెటిరో'పై పెరుగుతున్న నిరసన

మత్స్యకార గ్రామాల మత్స్యకారులకు జీవనోపాధి పోయింది. కంపెనీ రాకముందు సముద్రంలో వేటకు వెళ్లి కుటుంబాలను పోషించుకొనే మత్స్యకారులు, కంపెనీ వచ్చిన తరువాత వేటలేక బతకడానికి వలసలు వెళ్లాల్సివస్తోంది. పర్యావరణ నిబంధనలు పాటించకపోవడంతో తమ జీవనోపాధి దెబ్బతిన్నందున హెటిరోకు కొత్తపైప్‌లైన్‌కు అనుమతులు మంజూరుచేయవద్దని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి)లో కేసు వేశాం. మత్స్యకారుల కేసుపై ఎన్‌జిటి నియమించిన జాయింట్ యాక్షన్ కమిటీ పర్యావరణానికి జరిగిన నష్టాన్ని అంచనావేసి హెటిరో కంపెనీ నుంచి రూ.6.94 కోట్లు అపరాదరుసుము వసూలుచేయాలని ఎన్‌జిటికి సిఫార్సు చేసింది. ఈ కేసు ఎన్‌జిటిలో వుండగానే కొత్త పైపులైన్‌కు (సిఆర్‌జెడ్) అనుమతులు మంజూరుచేసింది. మత్స్యకారుల జీవనోపాధిని, ఎన్‌జిటిలో వేసిన కేసు పూర్వపరాలను పరిశీలించకుండానే, పరిగణనలోకి తీసుకోకుండానే అనుమతులివ్వడంతో మత్స్యకారుల ఉపాధికి మరింత నష్టం జరగనుంది.

సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి డీశాలినేషన్ ప్రాజెక్టు హెటిరో నిర్మించింది. హెటిరో డ్రగ్స్ కంపెనీ వల్ల భూగర్భ జలాలు కలుషితమైన మత్స్యకార గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించలేదు. ఉపాధి పోయిన కుటుంబాలకు కంపెనీలో ఉద్యోగాలు ఇవ్వడంలేదు. యువత విద్యార్హతకు తగిన ఉద్యోగాలు కల్పించడంలేదు. పైప్‌లైన్ ఏర్పాటుకు పంచాయతీ తీర్మానం లేదు. ఎన్‌జిటిలో కేసును పరిగణనలోకి తీసుకొని పైప్ అనుమతులు ఉపసంహరించుకోవాలి.' అని కార్యదర్శికి మెయిల్‌లో పంపించిన లేఖలో పేర్కొన్నారు.

11, 12 తేదీలో హెచ్ఎం అకౌంట్స్ టెస్ట్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఈనెల 11, 12, తేదీల్లో ప్రధానోపాధ్యాయుల అకౌంట్ టెస్ట్ నిర్వహించనున్నట్టు డిఇఒ ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను విజయవాడ, కడప కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగుతుందని, అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను www.bse.ap.gov.in అను వెబ్‌సైట్ నుంచి 7వ తేదీ నుంచి డౌన్ చేసుకోవచ్చని సూచించారు. హాల్ టిక్కెట్లు డౌన్ చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ నెంబరు, పుట్టిన తేదీతో లాగిన్ కావాలని సూచించారు

సిపోరమ్మ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- సీతమ్మధార : హెచ్‌బి కాలనీ బజార్ ఎంవిడియం స్కూల్ ప్రధానోపాధ్యాయిని సిపోరమ్మ సేవలు మరువలేనివని ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. ముందుగా సిపోరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్రైస్ట్‌చర్చ్ అధ్యక్షులు విజయకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఏలూరు డయాసిస్ అధ్యక్షులు ఎన్‌జెఎస్‌డి రాజు, జాన్ వెస్లీ తదితరులు హెచ్ఎంగా సిపోరమ్మ సేవలను కొనియాడారు కార్యక్రమంలో ఫాస్టర్ ప్రేమానందం, జాకబ్ జార్జి, వెంకటేశ్వరరావు, జయానంద్, సిఫొరమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

ముగిసిన వైజాగ్ ఫిల్మ్ ఫెస్టివల్

ప్రజాశక్తి- సీతమ్మధార : వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగానిర్వహిస్తున్న తెలుగు ఫిల్మ్ ఫెస్టివల్ బుధవారం ముగిసింది ముగింపు చిత్రంగా 2021లో యు.వేణు దర్శకత్వంలో రూపొందిన విరాట్‌పర్వం చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని ఫిల్మ్ ఫెస్టివల్స్ నిర్వహించేందుకు ప్రణాళికలు చేస్తున్నామన్నారు. త్వరలో కళాతపస్వి కె.విశ్వనాథ్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. అలాగే విదేశీ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఫెస్టివల్‌లో పాల్గొన్న ప్రేక్షకులతో ముఖాముఖి నిర్వహించి, వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో బి.చిన్నారావు, డాక్టర్ జి.బాబ్జి, అనూరాధ పాల్గొన్నారు.

సింహగిరి వైభవాన్ని చాటాలి

ప్రజాశక్తి- సింహాచలం: సింహగిరి వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని, అలాగే దేశ సంస్కృతి సాంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసేందుకు కళా రంగం కృషి చేయాలని సింహాచల దేవస్థానం ప్రధాన అర్చకులు గోడవర్తి శ్రీనివాస్ ఆచార్యులు కోరారు. బుధవారం సింహాచలంలో స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్‌కు చెందిన సింహగిరి వైభవాన్ని తెలిపే పలు ప్రదర్శనలు ఇచ్చారు. వారిని సింహాచలంలో దేవస్థానం ఎఇఒనరసింహారాజు ఇన్స్పెక్టర్ కనకరాజు, దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గంట్ల శ్రీనుబాబు మెమొంటోలతో సత్కరించారు.

అప్పన్న సన్నిధిలో కంచి కామకోటి పీఠాధిపతి

ప్రజాశక్తి -సింహాచలం: సింహాద్రి అప్పన్నను కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ సంప్రదాయ ప్రకారం సాగర స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన కొండ దిగునున్న దేవస్థానం వేద పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించి, సలహాలు, సూచనలు చేశారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -గోపాలపట్నం : 89వ వార్డు పరిధి గణపతి నగరం నుంచి అప్పల ననరసింహనగర్ కాలనీ వరకు రూ.19.90లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణ పనులకు వైసిపి పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్, వైసిపి నేత అయితంశెట్టి కోటేశ్వరరావు, అయితంశెట్టి గోపి, ఆళ్ల పైడిరాజు, కార్యకర్తలు వాలంటీర్లు పాల్గొన్నారు

గ్రీవెన్స్‌లో సమస్యల పరిష్కారం

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో పార్టీ సమన్వయకర్త కెకె.రాజు బుధవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించి, కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు.

ఆటో కార్మికులపై ఇ-చలానాల భారం

ప్రజాశక్తి -మధురవాడ : పోలీస్, రవాణాశాఖ అధికారులు ఆటోడ్రైవర్లపై ఇష్టానుసారంగా ఇ-చలానాల భారం వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని సిఐటియు నేతలు ఆక్షేపించారు. బుధవారం వుడా కాలనీ మోగదారమ్మ ఆటో స్టాండ్ వద్ద సిఐటియు అనుబంధ ఆటో సంఘాలతో.మధురవాడ జోన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు గరే చిన్నారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాజుకుమార్ మాట్లాడుతూ ఆటో కార్మికులను అధికారులు వేధిస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ఆరోపించారు. ఆటోల నిలుపుదలకు పార్కింగ్ స్థలాలు లేకుండా చేస్తున్నారని, ప్రస్తుతమున్న స్టాండ్‌ల వద్ద ఆటోలను నిలిపితే ఫొటోలుతీసి చలనాలను పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పెంచిన బీమా ప్రీమియం, ఆర్‌టిఎ ఛార్జీలను తగ్గించాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రధాన కూడళ్లు వద్ద కనీసం మూడు ఆటోలు నిలుపుకోవడానికి ట్రాఫిక్ పోలీసులు అనుమతి ఇవ్వాలని కోరారు. ఆటో, ఇతర ప్రైవేటు రవాణా



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

వాహనదారులు, కార్మికుల సమస్యలపై ఈనెల 11న జిల్లాసదస్సు, 13న చలో కలెక్టరేట్, ర్యాలీ, ధర్నాలో అఖిలభారత సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ ఉపాధ్యక్షులు డి అప్పలరాజు, ఆటో యూనియన్ జోన్ కార్యదర్శి టి రమేష్ బాబు, పి శంకరరావు, రఘు, ఎస్ ఎర్రయ్య, ఒ శ్రీను, రమణ, డి సన్ని, పి రాజు, పి ప్రకాశరావు, ఎస్‌కె.రెహమాన్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఎస్‌సి, ఎస్‌టిలకు అన్యాయం



మాట్లాడుతున్న ప్రభాకరరావు

ప్రజాశక్తి- సీతమ్మధార : కేంద్ర బడ్జెట్‌లో ఎస్‌సి, ఎస్‌టిలకు తీవ్ర అన్యాయం జరిగిందని, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జెవి. ప్రభాకరరావు అన్నారు. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయింపునకు దళిత సంఘాలు ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బుధవారం అంబేద్కర్ భవన్‌లో వివిధ దళిత సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో సామాజిక న్యాయం జరగలేదన్నారు. దేశ జనాభాలో నాలుగో వంతున్న దళితులకు రూ.పది లక్షల కోట్లు మంజూరు చేయాల్సి ఉందన్నారు. ఉపాధి హామీ పథకానికి రూ. 1.60 లక్షల కోట్లకుగాను రూ. 60 వేల కోట్లు కేటాయింపు, వంద రోజుల ఉపాధి పనిదినాలను 50రోజులకు తగ్గించడం దళితులు పట్ల కేంద్ర ప్రభుత్వానికున్న వివక్ష స్పష్టమౌతోందన్నారు. అంబేద్కర్ భవన్ అధ్యక్షులు బొడ్డు కల్యాణరావు మాట్లాడుతూ మోడీ అధికారంలో ఉంటే దళితులకు భవిష్యత్తు ఉండదని ఆవేదన వెలిబుచ్చారు. సమావేశంలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ కార్యదర్శి గురుమూర్తి, కెవిపిఎస్ ప్రతినిధులు సుబ్బన్న, చిరంజీవి, డిహెచ్‌పిఎస్ నేత రాంబాబు , దళిత గిరిజన జెఎసి నేత పతివాడ రాంబాబు పాల్గొన్నారు.

పదేపదే సర్వేలతో ఫలితమేంటి?

ఉక్కు నిర్వాసితులకు న్యాయం చేయాలి

టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి సత్యనారాయణ

ప్రజాశక్తి -గాజువాక : నిర్వాసిత కాలనీలో సచివాలయ సిబ్బందితో రాష్ట్ర ప్రభుత్వం చేయిస్తున్న సర్వేలను తక్షణమే నిలుపుదల చేయాలని టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి బి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం అగనంపూడి సిడబ్ల్యూసిలో టిడిపి కార్యకర్త సమావేశంలో మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో పూర్తి సమాచారం ఉంటుందని, అలాంటపుడు ఎస్‌డిసి ఆధ్వర్యంలో నిర్వాసిత కాలనీల్లో మళ్లీ సర్వే చేయడం వల్ల ప్రయోజనమేంటని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణ సమయంలో 16,500 ఆర్‌కార్డులు మంజూరు చేయగా,



మాట్లాడుతున్న సత్యనారాయణ

అందులో సగం మందికి కూడా ఉద్యోగాలివ్వలేదని, ఎంతో మందికి కనీసం ఉపాధి కల్పించలేదన్నారు. ఇప్పటికైనా నిర్వాసితుల సమస్యలకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నేతశ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు..

మురుగునీటిని మళ్లించే చర్యలు చేపట్టండి

అధికారులకు జివిఎంసి కమిషనర్ రాజాబాబు ఆదేశం



నీటి నిల్వను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి -తగరపువలస : సంగివలస జాతీయ రహదారిపై నిలిచిన నీటిని మళ్లించే చర్యలు చేపట్టాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం 1,2 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పన, బంగ్లామెట్ట లోతట్టు ప్రాంతంలో వాడుక, వర్షపు నీరు మళ్లింపు, సంగినవలస జాతీయరహదారిపై నీటి మళ్లింపు చర్యలు చేపట్టాలని, దీనికి అవసరమైన అవుట్‌లెట్‌లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఒకటో జోన్ కమిషనర్ బొడ్డపల్లి రాము, ఇంజనీరింగ్, యుసిడి అధికారులు, ఎపిడి ఎల్.రాము ఇతర శాఖల అధికారులు, వాలంటీర్లు , సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భార్య హంతకునికి యావజ్జీవ ఖైదు

ప్రజాశక్తి-లీగల్ రిపోర్టర్ : చెడు వ్యసనాలకు బానిసైన భర్త, తాను అడిగిన డబ్బులు ఇవ్వలేదని విచక్షణ మరిచి భార్యను హత్యచేసిన ఘటనలో నేరాభియోగం రుజువు కావడంతో నిందితుడైన భర్తకు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.రెండువేలు జరిమానా విధిస్తూ విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తల గోపి బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మరో రెండు నెలలు సాధారణ శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కాండ్రేగుల జగదీశ్వరరావు ఇచ్చిన సమాచారం ప్రకారం చింతపల్లి మండలం కుడుముసార పంచాయతీ నిమ్మపాడుకు చెందిన నిందితుడి కొర్ర రవి, 2016లో అంగన్వాడీ కార్యకర్త కొర్ర లక్ష్మిని రెండోపెళ్లి చేసుకున్నాడు. తాగుడుకు, చెడు వ్యసనాలకు బానిసైన కొర్రా రవి, మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని, భార్యను ఉద్దేశ్యపూర్వకంగా వదిలించుకోవాలని 2017 జూలై2న మద్యంమత్తులో భార్యను పిడి గుద్దులు గుద్ది చంపేశాడు. మతురాలి అన్న పంగి బోగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు చింతపల్లి సిఐ చంద్రశేఖర రావు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రం కోర్టులో దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి గోపి, నేరం రుజువు కావడంతో జీవితఖైదు విధించారు.

గృహోపకరణాల దగ్ధం

ప్రజాశక్తి -గోపాలపట్నం : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో బాజీ జంక్షన్ దరి ఎస్‌సి కాలనీలో గృహోకరణాలు దగ్ధమైన ఘటన బుధవారం ఉదయం జరిగింది. నేటిపూడి మురళీ, అచ్చయ్యమ్మ దంపతుల ఇంట్లో శ్లాబు ఫాల్స్ సీలింగ్ నుంచి మంటలు వ్యాపించి, బెడ్ రూం హల్ వరండా చుట్టూ వ్యాపించడంతో ఎసిలోని సిలిండర్ పెలి, ఇంట్లోని మొత్తం సామాగ్రి ఆహుతయ్యాయి, ఈ ప్రమాదంలో 15తులాల బంగారం, రూ.లక్ష నగదు, ఇంటి డాక్యుమెట్లు బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోగా సర్వం బూడిదైంది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే గణబాబు సంఘటనాస్థలిని సందర్శించి, బాధితులను పరామర్శించారు.

ఆక్రమణదారునిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రభుత్వ పోరంబోకు స్థలం విషయమై ప్రయివేటు వ్యక్తికి, రెవెన్యూ అధికారుల మధ్య కోర్టు కేసు నడుస్తుండగా, అదే స్థలంలో కంచె వేసి ఆక్రమణకు పాల్పడిన వ్యక్తిపై రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసారు.. పైనాపిల్ కాలనీ సర్వే నెంబరు 20/3 లో సుమారు ఒక ఎకరా స్థలం ఉంది. కోన తాతారావు అనే వ్యక్తి ఇటీవల ఆస్థలం తనదంటూ స్థలం చుట్టూ కంచె వేయడంతో,.రెవెన్యూ అధికారులు కంచె వేయకుండా అడ్డుకున్నారు. అయినా ఖాతరు చేయకుండా కంచె వేయడంతో రెవెన్యూ అధికారులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసారు. దీనిపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

సిఎం జగన్ నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి- సీతమ్మధార: ఆలయాల ట్రస్టు బోర్డు సభ్యుల నియమాకాల్లో నాయీ బ్రాహ్మణుల సామాజికవర్గం నుంచి ఒకరికి తప్పనిసరి స్థానం కలిపిస్తామన్న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రకటనపై గ్రేటర్ విశాఖ నాయీ బ్రాహ్మణ సేవాసంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం విశాఖ నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.కార్యక్రమంలోఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు, కోఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, మాజీ కార్పొరేటర్ కె.వెంగళరావు, రాష్ట్ర డైరెక్టర్ నూకరాజు, ఆరిపాక పెంటారావు, సుబ్బారావు, కె.చిన్నా, సూర్యనారాయణ, రాధాకృష్ణ, సత్యనారాయణ, త్రినాథ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి -మధురవాడ : గాయత్రి విద్యా పరిషత్ ఆసుపత్రి సౌజన్యంతో సామాజిక వైద్య విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం బోయిపాలెం జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలోఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గాయత్రి విద్యా పరిషత్ ఆసుపత్రి వైద్యులు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. రక్తపోటు, మధుమేహం, దృష్టిలోపం వంటి సమస్యలకు వైద్యపరీక్షలు చేశారు. గైనకాలజిస్ట్, ఆర్థోపెడిషియన్, జనరల్ సర్జన్ వైద్యులు శిబిరంలో పాల్గొని రోగులకు పలురకాల సేవలను అందించారు. గాయత్రీ విద్యా పరిషత్ కార్యదర్శి పి. సోమరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన వేతన ఒప్పందం అమలు చేయాలి



బిసి గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - గాజువాక : స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ఎన్‌జెసిఎస్‌లో జరిగిన ఒప్పందం మేరకు నూతన పేస్కేల్ తక్షణమే అమలు చేయాలని వైఎస్ఆర్‌టియుసి నేతలు డిమాండ్ చేశారు .బుధవారం స్టీల్‌ప్లాంట్ బిసి గేటు వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మస్తానప్ప, పిట్ట రెడ్డి, పరదేశి మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, ప్రభుత్వరంగంలో కొనసాగించాలని, అయిదేళ్లకు పైబడి రావాల్సిన బకాయి చెల్లించాలని, అన్ని విభాగాల్లోనూ మ్యాన్ పవర్ పెంచాలని, ఉత్పత్తి ఆధారంగా ఇన్సెంటివ్, పాత పద్ధతిలోనే ఇఎల్ ఎన్‌క్యాష్‌మెంట్, ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మాతృత్వ మమకారం



కుక్క దగ్గర పాలు త్రాగుతున్న ఆవు దూడ

ప్రజాశక్తి -అనందపురం : అమ్మ ఎవరికైనా అమ్మయేనని ఎందుకంటారో ఈ ఘటనను చూస్తే అక్షరసత్యమని ఇట్టే స్పష్టమౌతోంది. ఆకలి గొన్న ఆవుదూడకు తన చనుబాలను అందిస్తూ మాతృత్వ మమకారాన్ని చాటుకుంటోందో శునకరాజం. ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామపంచాయతీ రాయన వెంకటరావు కల్లాల దగ్గర చోటుచేసుకున్న ఈ అద్భుత ఘటనను పలువురు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో విస్తృత ప్రచారం సాగుతోంది. వీర బ్రహ్మం చెప్పినట్లు ఇది ప్రకృతికి విరుద్ధఘటనగా కనిపిస్తున్నప్పటికీ, అమ్మతనం ముందు అవన్నీ దిగదుడుపేనని అభిప్రాయం వ్యక్తమౌతోంది.

నిర్ణీత వ్యవధిలో నాడు నేడు పనుల పూర్తి



స్థలాన్ని పరిశీలిస్తున్న జెసివిశ్వనాథన్

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, చిప్పాడ జెడ్‌పి హైస్కూల్‌లో రెండో విడత నాడు, నేడు నిధులు రూ.1.38 కోట్లతో చేపట్టిన పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ బుధవారం పరిశీలించారు. మరుగుదొడ్లు, వంటగది నిర్మాణం పూర్తికాగా, ప్రహరీ సగం నిర్మాణం జరిగిందని, నాలుగు తరగతి గదులకు గ్రానైట్ టైల్స్ వేసినట్లు జెసికి సంబంధిత అధికారులు వివరించారు. మరో ఆరు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు జరగాల్సి ఉందని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ ఎస్ భాస్కరరెడ్డి, తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్, హెచ్ఎం రేఖ అప్పారావు పాల్గొన్నారు. పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు.

ప్రభుత్వానికి భూమిలిచ్చేందుకు ససేమిరా!

కొయ్యపేటలో గ్రామసభలో ముక్తకంఠంతో వ్యతిరేకించిన రైతులు



సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-పద్మనాభం: తరాలుగా తమకు జీవనోపాధినిస్తున్న భూములను ప్రభుత్వానికి ఇవ్వబోమని .మండలంలోని నేరేళ్లవలస పంచాయతీ కొయ్యపేటలో రైతులు స్పష్టం చేశారు. గ్రామంలో 40మంది రైతులకు చెందిన 52ఎకరాల భూములను జగనన్న కాలనీ ఏర్పాటుకు ఇవ్వాలంటూ రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఆయా భూముల్లోని జీడిమామిడి తోటలను, టేకు చెట్లను దౌర్జన్యంగా తొలగించిన ఘటనపై బాధిత రైతులు కోర్టును ఆశ్రయించారు. తమ అనుమతి లేకుండా భూమిని స్వాధీనం చేసుకోవాలనుకోవడంతోపాటు, ఆ భూముల్లోని చెట్లను తొలగించడం, వాటికి పరిహారం ఇవ్వకపోవడంపై అధికారుల తీరును రైతులు నిరసిస్తూ వస్తున్నారు. దీనిపై సిపిఎం నేత ఆర్ఎస్ఎన్.మూర్తిని బాధిత రైతులు ఆశ్రయించడంతో కొన్నాళ్లపాటు అధికారులు ఆ భూముల వద్దకు రాలేదు. అయితే బుధవార ఇన్‌చార్జి తహశీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి, జగనన్న కాలనీకి భూములు ఇవ్వాలంటూ మరోమారు రైతులను కోరిన నేపథ్యంలో, అధికారుల ప్రతిపాదనను రైతులంతా ముక్తకంఠంతో వ్యతిరేకించారు.దశాబ్దాలుగా తమకు జీవనోపాధినిస్తున్న భూములను ఎంత పరిహారం ముట్టజెప్పినా ఇచ్చేదిలేదంటూ తెగేసి చెప్పారు. రైతులను నచ్చజెప్పాలని అధికారులు ప్రయత్నించినా, గతంలోనే భూములు స్వాధీనానికి అధికారులు చేసిన దౌర్జన్యాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులంతా ససేమిరా అనడంతో చేసేది లేక వెనుదిరిగారు. కార్యక్రమంలో సిపిఎం నేత రవ్వ నర్సింగరావు పాల్గొన్నారు

టార్గెట్‌బాల్ క్రీడలో రాణించాలి

అఖిల భారత ఇంటర్ వర్సిటీ పోటీల ప్రారంభంలో గీతం అధ్యక్షుడు శ్రీభరత్



పోటీలను ప్రారంభిస్తున్న శ్రీభరత్

ప్రజాశక్తి -మధురవాడ : భారతీయ క్రీడగా ఇటీవలి ప్రసిద్ధి చెందిన టార్గెట్ బాల్‌లో భారతీయ యువత రాణించి, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని గీతం విద్యాసంస్థల అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ ఆకాంక్షించారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు గీతం వర్సిటీలో నిర్వహించనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల టార్గెట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. టార్గెట్ బాల్ వంటి నూతన క్రీడల ద్వారా త్వరితంగా జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందన్నారు. భారతీయ టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సోనూశర్మ మాట్లాడుతూ హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్‌ను కలిసి టార్గెట్‌బాల్ క్రీడగా 2012లో మధురలో ప్రారంభించగా, 2017 నుంచి భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం దీన్ని ప్రోత్సాహిస్తోందన్నారు. గీతం క్రీడా విభాగం డైరక్టర్ అరుణ్ కార్తీక్ మాట్లాడుతూ గీతం వేదికగాజరుగుతున్న పోటీలోదేశంలోని 29 విశ్వవిద్యాలయాల నుంచి 350 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని వెల్లడించారు.కార్యక్రమంలో గీతం ప్రొ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం క్రీడా విభాగం డిప్యూటీ డైరక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడా పతాకాలను ఎగురవేసి క్రీడా ప్రతిజ్ఞ చేశారు.

గీత భరోసా ప్రకటనపై హర్షం



సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సుజాత, తదితరులు

సీతమ్మధార : గీత కార్మికుల వృత్తిలో భాగంగా కల్లు సేకరణలో ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం వచ్చినా వైఎస్ఆర్ గీత భరోసా కింద బాధిత కుటుంబానికి రూ.పది వేల పరిహారం ఇస్తామన్న సిఎం జగన్ ప్రకటనపై ఎపి యాత సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ పిల్లి సుజాత హర్షం వ్యక్తం చేశారు. దీనిపై సిఎం జగన్‌కు ధన్యవాదాలు తెలుపుతూ, బుధవారం తన స్వగృహంలో కార్పొరేషన్ డైరెక్టర్లు, కల్లుగీత వృత్తిదారులు, యాత సంఘీయులతో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సంబంధిత మంత్రికి, సిఎం జగన్‌కు తాము చేసిన విజ్ఞప్తి మేరకు రూ.ఐదు లక్షలుగా ఉన్న పరిహారాన్ని రెట్టింపు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. యాతల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని వెల్లడించారు.

ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం హర్షం

సీతమ్మధార: యాతల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పక్షాన తామంతా నిలుస్తామని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షులు పిల్లి సూరిబాబు అన్నారు. గీత వృత్తిదారులకు ప్రమాదబీమా గీత భరోసా ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. వృత్తి లేని సమయంలో గీత కార్మికులకు జీవనభృతి, విద్యావంతులైన యాతల్లో ఒకసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలన్న తమ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఉత్తరాంధ్రలోని వైసిపి నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధుల సూచనల మేరకు వైసిపి అభివృద్ధిలో తామంతా భాగస్వాములమౌతామని ప్రకటించారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మమ్మ ఆలయ చైర్‌పర్సన్ కొల్లు సింహచలం, చోడే సావిత్రి, చుక్క విష్ణు వందన, కొలుసు రూపవతి సత్యం, పోలవరపు అప్పారావు, దమ్ము రమణ, పుష్పలత లక్ష్మీ, ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం ప్రతినిధులు ఈశ్వరరావు, సంపంగి మంగరాజు, లోకేష్, అండిబోయిన అప్పారావు, త్రినాథ్, గొద్దు కన్నారావు పాల్గొన్నారు

రోడ్డుపై ఉన్న బడ్డీ తొలగింపు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-సీతమ్మధార : బివికె కాలేజ్ రోడ్డులో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు పెట్టిన బడ్డీని ట్రాఫిక్ పోలీసుల సహకారంతో జీవిఎంసి అధికారులు తొలగించారు. 'రోడ్డుపై బడ్డీ.. ట్రాఫిక్‌కు ఇబ్బందులు' శీర్షికతో బుధవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి జివిఎంసి అధికారులతోపాటు ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. యుద్ధప్రాతిపదికన అక్కడున్న బడ్డీని తొలగించారు.

12న బొకారోలో కన్వెన్షన్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్మికులు, నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఈనెల 12న బొకారోలో జరుగు ఆల్ ఇండియా స్టీల్ కాంట్రాక్టు వర్కర్ కన్వెన్షన్‌ను జయప్రదం చేయాలని యూనియన్ గౌరవ అధ్యక్షులు ఒ.వి.రావు కోరారు. బుధవారం స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో కన్వెన్షన్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒ.వి.రావు మాట్లాడుతూ స్టీల్ కాంట్రాక్టు కార్మికులకు. ఎన్‌జెసిఎస్‌లో మాదిరిగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.ఐదేళ్లకోసారి వేతన సవరణ చేస్తూ కేంద్ర ప్రభుత్వం జిఒజారీ చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని స్టీల్ పరిశ్రమల్లోని కాంట్రాక్టు కార్మిక నేతలు 12న బొకారో కన్వెన్షన్‌లో పాల్గొంటారని, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి శ్రీనివాసరావు. యు సోమేష్. అంకం రెడ్డి శ్రీను. ఎన్ దేముడు. నాయుడు. సిహెచ్ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో సత్తా

ప్రజాశక్తి- ఉక్కునగరం : జెఇఇ మెయిన్స్ ఫస్ట్‌ఫేజ్ ఫలితాల్లో గాజువాక, కూర్మన్నపాలెం సుదీక్ష జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. 99.53 పర్సంటైల్‌తో సాయికౌశిక్, కాయల.తరణ్(97.78), సత్యం.కుమార్జా (97.41), వి.జస్వంత్(97.25) పర్సంటైల్ సాధించంగా, మరో 13మంది విద్యార్థులు 90పర్సంటైల్‌తో కాలేజీ సత్తాను చాటారని కాలేజీ చైర్మన్ అప్పలనాయుడు వెల్లడించారు. బుధవారం ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. విశాఖ విమానాశ్రయం సలహాదారుల కమిటీ సభ్యులు కరణంరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు.

అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

ఐఐటి జెఇఇ మెయిన్స్ ఫలితాలలో అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు సత్తాచాటారు. వరుసగా మూడో ఏడాది ఒక ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు ఐఐటిలో ప్రతిభచూపడంపై 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అభినందించి విద్యార్థులను సన్మానించారు అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి 2019లో ఆసిరినాయుడు, 2020లో అనిల్‌కుమార్ ఐఐటికి క్వాలిఫై అయ్యి ఎన్ఐటి జలంధర్‌లో రోబోటిక్ ఇంజనీరింగ్‌లో చదువుతున్నాడని, ఈ ఏడాది ఇద్దరికి ఐఐటి సీట్లు రావడంపై కాలేజీ సిబ్బంది హర్షం వెలిబుచ్చారు.

స్కైమార్షల్ ఆర్ట్స్‌లో జ్ఞానవర్ధన్‌కు రజతం

ప్రజాశక్తి - అనందపురం: ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు నేపాల్‌లో జరిగిన 7వ సౌత్ ఏషియన్ స్కైమార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఛాంపియన్ షిప్ పోటీల్లో భారతదేశం తరుపున ప్రాతినిధ్యం వహించిన మండలంలోని శొంఠ్యాం పంచాయతీ మిందివానిపాలెం గ్రామానికి చెందిన నాగిశెట్టి జ్ఞానవర్ధన్ అండర్-14 విభాగంలో రజత పతకాన్ని సాధించాడని కోచ్ లెంక అప్పలరాము తెలిపారు. వివిధ విభాగాల్లో మన జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచి పలు పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా రజత పతక విజేత జ్ఞానవర్ధన్‌ను స్కై ఇంటర్నేషనల్ గ్రాండ్‌మాస్టర్ నజీర్ అహ్మద్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆబోతు అప్పలరాము, స్థానికులు అభినందించారు.

క్వారీలు, క్రషర్లు ఏర్పాటు చేయొద్దు

ప్రజాభిప్రాయ సేకరణలో స్పష్టం చేసిన మార్టూరు గ్రామస్తులు

ప్రజాశక్తి-అనకాపల్లి

తమ గ్రామంలో స్టోన్ క్రషర్లు, క్వారీలు ఏర్పాటు చేయొద్దని మండలంలోని మార్టూరు గ్రామస్తులు ముక్తకంఠంతో స్పష్టం చేశారు. క్వారీలు, క్రషర్ల వల్ల తమ గ్రామంలో గాలి, నీరు కాలుషితమయ్యాయని, శబ్ధ కాలుష్యంతో ఇళ్ల దెబ్బతినడంతో పాటు ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, పశువులు చనిపోతున్నాయని తెలిపారు. పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో మార్టూరు గ్రామంలో సర్వే నెంబర్ 1లో శ్రీనామా కృష్ణయ్య పేరుతో 13.33 హెక్టార్లలో ఏర్పాటు చేయనున్న రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్ క్వారీ, అదే సర్వేనెంబర్‌లో ర్యాంక్ సిలికాన్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ 10.13 హెక్టార్లలో ఏర్పాటు చేయనున్న క్రషర్లపై ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ముఖ్యఅతిథిగా డిఆర్ఓ వెంకటరమణ హాజరై దీనిని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 22 ఏళ్లగా నామా కృష్ణయ్య క్వారీ నడుస్తున్నా ప్రజలకు ఎటువంటి సదుపాయాలు కల్పించలేదన్నారు. ఈ క్వారీని ఆనుకొని ఉన్న పశువులు పాకలు దెబ్బ తినడం, పశువులు చనిపోయాయని తెలిపారు. పక్కనే ఉన్న గెడ్డ కప్పి వేయడంతో పంట పొలాలకు నీరు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు నివేదికలతో అధికారులను, ప్రజలను మభ్యపెట్టి యాజమాన్యం క్రషర్లు క్వారీలు ఏర్పాటు చేయడం బాధాకరమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రజల మధ్యలో జరగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మైన్స్ అసిస్టెంట్ జియాలజిస్ట్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



తమ వ్యతిరేకతను తెలియజేస్తున్న మార్టూరు గ్రామస్తులు



రోగులకు కళ్లద్దాలు అందజేస్తున్న ఎన్‌టిపిసి అధికారులు

ఎన్‌టిపిసి ఆధ్వర్యాన మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పరవాడ

ఎన్‌టిపిసి సింహాద్రి సిఎస్ఆర్ నిధులు ఇనిషియేటివ్స్ కింద మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో బుధవారం సమగ్ర కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ నేత్ర శిబిరాన్ని ఎన్టిపిసి సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా ప్రారంభించారు. నేత్ర శిబిరంలో గుర్తించిన లబ్ధిదారులకు కంటి పరీక్షలు, ఉచిత కళ్లద్దాలు, మందుల పంపిణీ చేసారు, కంటిశుక్లం, ఇతర ప్రత్యేక శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించిన రోగులను గురువారం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో శస్త్రచికిత్స కోసం షార్ట్‌లిస్ట్ చేశామని తెలిపారు. 482 రోగులకు పరీక్షలు నిర్వహించారు. 315 మందికి కల్లద్దాలు పంపిణీ చేశారు. 35 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజు సిన్హా, నాయుడుపాలెం సర్పంచ్ వరలక్ష్మి, ఎజిఎమ్ రుమా డి శర్మ, సిఎమ్ఒ డాక్టర్ మహాపాత్ర, మేనేజర్ కె ప్రకాశరావు, అధికారులు, దీపిక లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ఉమ్మడి విశాఖ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి - యలమంచిలి : ఈ నెల 12వ తేదీన కాకినాడలో జరగనున్న 38వ రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలకు బుధవారం ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు ఎంపిక జరిగినట్లు తైక్వాండో కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. స్థానిక వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ ఎంపిక కార్యక్రమంలో బాలురు, బాలికలు 8 విభాగాల్లో ఎంపిక జరిగినట్లు వెల్లడించారు. బాలుర జట్టుకు బి.శేషు, ఎం.నాగేశ్వరరావు, ఏ.రవితేజ, గణేశ్, పి.గణపతి విజయ్, ఐ గురుప్రసాద్‌నాయుడు, జె.నవీన్, జి.విజయ్‌కుమార్, బాలికల జట్టుకు జి.లిఖిత, ఆర్.పల్లవి, టి.శ్వేత, యు.జయశ్రీ, కె.రేణుకశ్రీ ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.అచ్చంనాయుడు, నేషనల్ రిఫరీ కల్లేపల్లి శంకర్రావు, బి.గోపాలకృష్ణ, శ్రీను, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అచ్చుతరెడ్డి తదితరులు అభినందించారు.

అయ్యన్న కళాశాలలో ఆధార్ సేవలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : విద్యార్థులందరూ ఆధార్ నమోదు సేవలను వినియోగించుకోవాలని అయ్యన్న విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ ఖాశీం అన్నారు. స్థానిక అయ్యన్న కళాశాలలో బుధవారం "ఆధార్ అథంటికేషన్ ప్రోగ్రాం" నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాశీం మాట్లాడుతూ ఆధార్ కార్డుతో వేలిముద్రల సేకరణ, ఫోన్ నెంబర్ నమోదు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ పోతల మౌనిక, రెడ్డి జనార్ధన్, కళాశాలల అధ్యాపకులు సీముసురు రమణ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



ఆధార్ నమోదులో పాల్గొన్న విద్యార్థులు

పాలకు గిట్టుబాటు ధర కల్పించాలి

పాల ఉత్పత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు



మాట్లాడుతున్న రాంబాబు, చిత్రంలో అప్పారావు, బాలకృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లి

పాలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని పాల ఉత్పత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంబాబు డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రాము నాయుడు కార్మిక కర్షక నిలయంలో బుధవారం జరిగిన ఉత్పత్తిదారుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు లీటరుకు నాలుగు రూపాయలు మద్దతు ధర పెంచుతామని హామీ ఇచ్చారని, మూడున్నరేళ్లు దాటుతున్న ఆ హామీ నెరవేర్చలేదని తెలిపారు. కేరళ ప్రభుత్వం లీటరు ఒక్కంటికి రూ.34 చొప్పున ఏడాదికి వెయ్యి లీటర్లు సరఫరా చేసిన వారికి అదనంగా రూ.34 వేలు అందిస్తుందని తెలిపారు. దీంతో ఆ రాష్ట్రంలో పాల ఉత్పత్తిదారుల సంఖ్య పెరిగిందన్నారు. సంఘం నాయకులు కర్రి అప్పారావు, ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో రైతాంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ పాడి రైతులకు లీటరుకు పది రూపాయలు చెల్లించాలని, సహకార రంగంలో కొనసాగించాలని కోరారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9న అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాల్లో రైతాంగం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- అనకాపల్లి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం జరిగింది. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక భవనంలో ఈ నెల 7, 8 తేదీల్లో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పావని సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులుగా ఎం.రమణ, కార్యదర్శిగా ఎస్.నాగ రమణ, కోశాధికారిగా గొర్లి తరుణ్, ఉపాధ్యక్షులుగా బి.బాబ్జి, ఎం.బాలాజీ, సహాయ కార్యదర్శులుగా గీతాకృష్ణ, శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులుగా శ్రీను, కేశవ, శిరీష, చాందిని, పావని, జ్యోతి, మౌనిక, గాలి జ్యోతి, తనూజ, సిద్దు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ సమస్యలపై ఉద్యమిస్తామన్నారు. అన్ని మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తగినంత సిబ్బందిని నియమించాలని, కాస్మోటిక్ ఛార్జీలు, మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు ఆర్.శంకరరావు మాట్లాడారు.



ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.రమణ, కార్యదర్శి ఎస్.నాగరమణ, కోశాధికారి గొర్లి తరుణ్

గౌరీ పరమేశ్వరుల ఉత్సవ పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి- కశింకోట

కశింకోటలో ఈనెల 11న జరగనున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవం పోస్టరును రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ సతీమణి హిమగౌరి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయ బద్ధంగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నాయకులు వేగి గోపికృష్ణ, పెంటకోట రాము, బొడ్డేడ బాలాజీ, దాడి నాగరాజు, ఆడారి నర్సింగరావు, కొయిలాడ నాగు, పెంటకోట తాతారావు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

101వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఒబి ప్రధాన గేట్ ముందు 8 గ్రామాల నేవీ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన బుధవారం నాటికి 101వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నేవీ నిర్వాసిత జెఎసి నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. తాము శారదా, వరాహ నదుల్లో వేటకు వెళ్లి తమ జీవనాన్ని కొనసాగించేవారమని, ఇప్పుడు నేవీ అనుమతి ఇవ్వకపోవడంతో ఉపాధి కోల్పోయి రోడ్డు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. 100 రోజులుగా పనుల్లేక పస్తులుంటున్నామని వాపోయారు. ఒప్పందం మేరకు తక్షణమే జెట్టీ నిర్మించాలని, అంత వరకు ఆధార్ కార్డు ఆధారంగా నేవీ గేట్ లోపల నుంచి చేపల వేటకు అనుమతించాలని కోరారు.

దట్టంగా పొగ మంచు

ప్రజాశక్తి - కశింకోట

మండలంలో తాళ్ళపాలెం- నర్సీపట్నం రోడ్డులో బుధవారం తెల్లవారుజామున పొగ మంచు దట్టంగా కురిసింది. అటుగా రాకపోకలు సాగించిన వాహనదారులు తెల్లవారినా లైట్లు వేసుకొని ప్రయాణం సాగించాల్సి వచ్చింది. ఉదయం 6 గంటలు నుండి 8 గంటల వరకు రోడ్డు మంచు తెరలతో నిండి పోయింది. రైతులు ఎండ కాసిన తరువాత పొలాలకు వెళ్ళారు. ఏజెన్సీ ప్రాంతాన్ని తలపించేలా కురిసిన ఈ మంచు జీడి, మామిడి తోటలకు తీవ్ర నష్టం కలగజేస్తుందని రైతులు చెప్పారు.



తాళ్లపాలెం-నర్సీపట్నం రోడ్డులో దట్టంగా కురుస్తున్న పొగ మంచు



తహశీల్దారుకు సమస్యను విన్నవిస్తున్న సిపిఎం నేత రాము

పట్టభద్రుల ఓటర్ల జాబితాల్లో తప్పులను సరిచేయాలి

తహశీల్దారుకు సిపిఎం వినతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓటర్ల జాబితాలోని అచ్యుతాపురం మండలానికి చెందిన ఓటర్లలో చోటుచేసుకున్న తప్పులను సరిచేయాలని కోరతూ బుధవారం తహశీల్దారు శ్రీనివాసరావుకు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో జరిగిన తప్పులను తహశీల్దారు దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. అచ్చుతాపురం మండలానికి సంబంధించిన ఓటర్ లిస్ట్ గందరగోళంగా ఉందన్నారు. మండలంలో 197, 198 పోలింగ్ బూతులను హైస్కూల్లో ఏర్పాటు చేశారని, ఆ రెండు బూతుల్లో ఒకే గ్రామానికి చెందిన ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎలమంచిలి, హరిపురం, మెలిపాక ఇతర మండలాల ఓట్లు అచ్చుతాపురం ఓటర్ల జాబితాలో చేర్చారని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సరిచేసి గ్రామాల వారీగా జాబితాలను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కడారి అప్పారావు, కె.సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై మహమ్మద్ ఆలీ సూచించారు. మండలంలోని వాడ్రాపల్లి, గొల్లల పాలెం గ్రామాల ఎన్‌ఆర్‌ఈజీఎస్ కూలీలకు వాడ్రాపల్లి గ్రామంలో బుధవారం ఆన్లైన్ మోసాలపై సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వివిధ పథకాల ద్వారా నగదు మీ బ్యాంక్ అకౌంట్‌లో పడుతుందని, మీ అకౌంట్ నెంబరు వివరాలను తెలియజేయాలని మోసపూరిత ఫోన్ కాల్స్‌ను వారికి ఇవ్వొద్దని సూచించారు. బ్యాంకుకు సంబంధించిన అకౌంట్ నెంబర్, ఐఎఫ్ఎస్‌సి కోడ్లను అపరిచిత ఫోన్ కాల్స్ వస్తే తెలియచేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి- కశింకోట : కస్తూరిబా గాంధీ బాలకల విద్యాలయం విద్యార్థినులు పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతీ సాధించాలని ఎపిఎస్‌పిఆర్‌సి బృందం సభ్యురాలు టి.ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని త్యేగాడ కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని ఎపిఎస్‌పిఆర్‌సి బృందం పరిశీలించింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువు తోపాటు ఆటలు పాటలు కూడా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకళ, విద్యార్థులు పాల్గొన్నారు.

రబీ పంటపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని మారేపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఎల్‌వై.కాంతమ్మతో కలిసి అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ టి.దాసు, ఏఓ విజేత రైతులకు, వ్యవసాయ సిబ్బందికి రెండో పంట (రబీ) మినుములు పంట మీద పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 19.19.19 పౌడర్ ఒక కేజీని నీటి కలిపి ఎకరా పొలానికి పింది, పూత దశలో పిచికారీ చేయాలని సూచించారు. 35 రోజులు దాటిన తరువాత పింది దశ తరువాత వేప నూనె 1 ఎకరానికి 1000 మీల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్ కుమార్, ఆర్‌బికే సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

బాలలపై మత్తు పదార్థాల నీడ పడరాదు

జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి

ప్రజాశక్తి-అనకాపల్లి

బాలలపై మత్తు పదార్థాల నీడ పడరాదని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీస్, ఎక్సైజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఇన్‌కమ్ టాక్స్ శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. 18 ఏళ్ల లోపు పిల్లలకు మత్తు పదార్థాలు అమ్మకుండా బోర్డులు పెట్టాలని, మత్తు పదార్థాలు వచ్చే అనర్థాలపై పాఠశాలలు కళాశాలలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. కమిషన్ సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ బాలలు, విద్యార్థుల జీవితాలను ఛిద్రం చేస్తున్న మత్తు పదార్థాలు, బాలల అక్రమ రవాణా వ్యవహారాలపై కమిషన్ డేగ కళ్ళతో పర్యవేక్షణ చేస్తుందని చెప్పారు. మత్తు పదార్థాలు, బాలల అక్రమ రవాణా రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ముందు ఉంచడంలో అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆదిలక్ష్మి, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు జి.ఉమా, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ ఎంఆర్‌ఎల్ రాధ, అడిషనల్ ఎస్పీ పిఎస్‌ఎన్ రావు, జిల్లా ఆబ్కారి అధికారి ఎన్వి రమణ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి ఉషారాణి, అదనపు వైద్య శాఖ అధికారి శారదబాయి, బీసీ సంక్షేమ శాఖ అధికారి కే రాజేశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అజయ్ బాబు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నాగ శిరీష, దిశ పోలీస్ ఇన్‌స్పెక్టర్ టి లక్ష్మి, డ్రగ్ కంట్రోల్, కమర్షియల్ టాక్స్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలి

ఫ్యాప్టో చైర్మన్ చిన్నబ్బాయి



నినాదాలు చేస్తున్న ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉపాధ్యాయులపై విద్యాశాఖ ఉన్నతాధికారుల వేధింపులు ఆపాలని ఫ్యాప్టో అనకాపల్లి జిల్లా శాఖ చైర్మన్ గొంది చిన్నబ్బాయి అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం చిన్నబ్బాయి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను తీవ్ర మానసిక ఒత్తిడి గురి చేయడం సరికాదన్నారు. స్వేచ్ఛగా విద్యాబోధన చేసుకునే అవకాశం ఉపాధ్యాయులకు కల్పించాలన్నారు. విద్యా సంవత్సరం ముగుస్తున్న సమయంలో లెసన్ ప్లాను, ఎల్‌ఐపి ప్లాను, బైజూస్ కంటెంట్ చూసి లెసన్ ప్లాన్ రాయాలని చెప్పడం సరికాదని తెలిపారు. విద్యా బోధనతో పాటు బోధనేతర పనులు, మధ్యాహ్న భోజనం, బాత్‌రూమ్‌ల నిర్వహణ, నాడు-నేడు, రకరకాల యాప్‌ల నిర్వహణతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయని ప్రభుత్వం పనిచేస్తున్న వారిపై అదనపు భారం మోపడం సరికాదన్నారు. ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం, 8వ తేదీ దాటిన జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. బోధనేతర పనుల నుంచి ఉపశమనం లేకపోతే బోధన కుంటుపడే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్యలపై భవిష్యత్తులో అన్ని సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఫ్యాప్టో జనరల్ సెక్రెటరీ వై సుధాకర్, కో చైర్మన్ సాయి ప్రసాద్, డిప్యూటీ సెక్రెటరీ జనరల్ ప్రేమ్ కుమార్, ఎన్ సన్యాసినాయుడు, రమణాజీ, కార్యవర్గ సభ్యులు వి.శ్రీలక్ష్మి, శాస్త్రి, ఏ.రవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో గిరిజన సంక్షేమశాఖ అధికారిని నియమించాలి


సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

అనకాపల్లి జిల్లాలో ఉన్న నాన్ షెడ్యూల్డ్ ఏరియాలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా గిరిజన సంక్షేమశాఖ అధికారిని నియమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని నర్సీపట్నం, చోడవరం వి.మాడుగుల నియోజకవర్గాల పరిధిలో దాదాపు 320 గిరిజన గ్రామాలు, 95 వేలు మంది గిరిజన జనాభా ఉన్నట్లు తెలిపారు. వీరు పేరుకే గిరిజనులని, ప్రభుత్వం నుండి వచ్చే ప్రత్యేక రాయితీలు, సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, స్పెషల్ డిఎస్‌సి, 1/70 చట్టం వంటివి వీరికి వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాల పునర్విభజన తరువాత వీరికి ఐటిడిఎ కూడా లేకుండా పోయిందని, వీరి కష్టాలు చెప్పుకోవడానికి ప్రత్యేక అధికారి లేకపోవడంతో గిరిజనుల బతుకులు ఆయోమయంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక గిరిజన గ్రామాల ప్రజలు నేటికీ పూరిగుడెసల్లో జీవనం సాగిస్తున్నారని, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక వసతులు లేవని తెలిపారు. వీరిని రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్‌లో చేర్చితేనే న్యాయం జరుగుతుందని, కాని స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యేలు తొక్కిపెట్టడంతో ఆ జాబితాలో చేరలేదని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు నిర్లక్ష్యాన్ని వీడి నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.

10న విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- సబ్బవరం : సబ్బవరం-2 సెక్షన్ పరిధిలోని 33/11కెవి, అంతకాపల్లి సబ్ స్టేషన్-11కెవి, గుల్లేపల్లి రూరల్ ఫీడర్ పరిధిలో ఈ నెల 10న శుక్రవారం ఉదయం 9గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని సబ్బవరం సబ్ డివిజన్ డిప్యూటీ ప్రాజెక్ట్ ఇంజినీర్ బి.నిరీక్షణ్ అంబేద్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతకాపల్లి సబ్ స్టేషన్, గుల్లేపల్లి రూరల్ ఫీడర్ పరిధిలోని గుల్లేపల్లి, మొగలిపురం, మల్లునాయుడుపాలెం, బోదువలస, ఎల్లుప్పి, అయ్యన్నపాలెం, దుద్దువక, కిల్లివానిపాలెం, రాపర్తివానిపాలెం, మర్రిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

విదేశీ విద్యా పథకం నిబంధనలు సరళీకరించాలని వినతి

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : విదేశీ విద్యా పథకానికి సంబంధించిన నిబంధనలు సరళీకరించాలని టిడిపి నాయకులు బుధవారం స్థానిక ఇన్‌ఛార్జి తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014-2019 మధ్య కాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు సామాజిక తరగతుల వారికి విదేశీ విద్యా పథకం ద్వారా విదేశాల్లో చదువుకునే వారికి మెరుగైన సేవలు అందించినట్లు చెప్పారు. నేటి వైసీపీ ప్రభుత్వం క్యూఎస్ 200 పేరుతో అర్హులను కుదించేందుకు కుట్ర చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిబంధనలను సరళీకరించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు తరగతుల విద్యార్థులకు భరోసాగా ఈ పథకాన్ని అమలు చేయాలని, క్యూఎస్ 200 నిబంధనలను సడలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భీమరశెట్టి శ్రీనివాస్, దాడి ముసలి నాయుడు, మల్ల వరాహనరసింగరావు, ముల్లేటి సత్యనారాయణ, డొక్కా నాగభూషణం, సబ్బి సింహాచలం, ఆడారి గోవిందు, మల్ల శేషుబాబు, బొడ్డేడ ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామాలలో వార్డుల వారీగా ప్రచారం చేయాలని వైసిపి మండల అధ్యక్షులు దేశంశెట్టి శంకర్రావు పిలుపునిచ్చారు. మండలంలోని ఎం.జగన్నాధపురం, ఉప్పువరం గ్రామాలలో బుధవారం వాలంటీర్లు, గృహసారధులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మండల కన్వీనర్ రాజాన విజయను సత్కరించారు అనంతరం శంకర్రావు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు జగన్మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కోన బుజ్జి, పిన్నమరాజు వాసు, భీముని వెంకటేశ్వరరావు, రావి శోభన్ బాబు, గంగిరెడ్డి రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-పరవాడ : కుల, మత భేదాలు లేకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని నాయుడు పాలెం పంచాయతీ వెంకటపతి పాలెం, సంమింగపాలెం హనుమాన్ కాలనీ, కోరంగివన్నిపాలెం, గొల్ల పేట, కొండవాన్నిపాలెం గ్రామాల్లో బుధవారం ఉదయం మూడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతీ ఇంటిఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలుపై అరా తీశారు. అనంతరం భరణికం పంచాయతీ కట్టవాన్నిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం హై ప్రయారిటీ నిధులు రూ.7.50 లక్షలతో సిసి డ్రైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, స్థానిక సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, ఎంపిటిసి ఆర్జిల్లి దేవి, ఎంపిడిఒ హేమ సుందరరావు, పలువురు సర్పంచ్‌లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీతో చెరువుల అభివృద్ధి

ప్రజాశక్తి - కశింకోట : ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని పలు గ్రామ పంచాయితీల్లో 69 చెరువులను గుర్తించి అభివృద్ధి చేయనున్నట్లు ఎంపిడిఓ కొంకి అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులలో పూడిక తీయడం, గట్టు బలపర్చడం, మొక్కలు నాటడం వంటి అభివృద్ధి పనులు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ శివ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు రమేష్, వెంకట లక్ష్మీ, సత్యారావు పాల్గొన్నారు.



ఉపాధి హామీపై జరిగిన సమావేశంలో పాల్గొన్న సిబ్బంది

28 నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :ఈనెల 28 నుండి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని గృహ సారథులు విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పిలుపు నిచ్చారు. ఆయన పంపిన వీడియోలో మాట్లాడుతూ, నియోజకవర్గ నాలుగు మండలాల నుండి ఐదు రోజులుగా క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశాన్ని విజయవంత చేసినందుకు గాను వాలంటీర్లు, గృహ సారుదులకు, వైసిపి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రోజుకు 10 ఇళ్ల చొప్పున జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించి వారం రోజుల్లోగా పూర్తి చేయాలని గృహసారథులు, కన్వీనర్లకు తెలిపారు.

నేడు ఎడ్ల పందేల పోటీలు

ప్రజాశక్తి-చీడికాడ:దిబ్బపాలెం గ్రామంలో మడిమంబ తీర్థం సందర్భంగా ఈనెల 9న గురువారం జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ తుంపాల నిరంజని, ఎంపీటీసీ దారపు పెద్ది నాయుడు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆలయంలో ఉదయం నుంచి అభిషేకాలు, పూజలు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందాలు, ముగ్గుల పోటీలు జరుగుతాయన్నారు. రాత్రికి పౌరాణిక నాటకం తో పాటు జానపద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ప్రారంభిస్తున్న సర్పంచ్

జల జీవన్ మిషన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో బికెపల్లి పంచాయతీలో రూ.33 లక్షలతో జల జీవన్ మిషన్ పనులను బుధవారం స్థానిక సర్పంచ్ లింగన్న నాయుడు, ఎంపిటిసి రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు



శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

ఉష శ్రీ ప్రసాద్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -పాయకరావుపేట:పాయకరావుపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ గార ఉషశ్రీ ప్రసాద్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహం వద్ద మండల నాయకుల ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి మిఠాయిలు స్వీట్లు పంపిణీ చేశారు. భారీ బాణాసంచాతో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లంక సూర్యనారాయణ, ఎంపీపీ పార్వతీ తాతారావు, మండల పార్టీ అధ్యక్షులు గనిశెట్టి బాబురావు, బీసీ నాయకులు కేసనకుర్తి సత్తిబాబు, లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి లక్ష్మణరావు, ఉప సర్పంచ్ జగతా శ్రీను, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-కోటవురట్ల:హౌసింగ్, సచివాలయ నిర్మాణాలు, స్పందన ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫిడెన్స్‌లో ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నుంచి వీడియో కాన్ఫరెన్స్ అందుబాటులోకి రావడం పట్ల మండల పరిషత్ సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

త్వరితగతిన గృహాల నిర్మాణాలు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-నక్కపల్లి:త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని గొడిచెర్ల జగనన్న లేఅవుట్‌లో బుధవారం లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామరాజు, హౌసింగ్ ఏఈ రాజు మాట్లాడుతూ, లే అవుట్‌లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, బిల్లుల చెల్లింపులో కూడా జాప్యం లేకుండా చూస్తామన్నారు. లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణం ప్రారంభించాలని సూచించారు. ఇప్పటివరకు ఇంటి నిర్మాణ పనులను ఎందుకు ప్రారంభించలేదని అడిగి తెలుసుకున్నారు. సకాలంలో గృహ నిర్మాణం పనులను చేపట్టకుంటే అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయి లక్ష్మి, వైసిపి నాయకులు అల్లు రమణ, నల్లల రామకృష్ణ, వర్క్ ఇన్స్పెక్టర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-రోలుగుంట:ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు రోలుగుంట గ్రామంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవ ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు 72 అడుగుల బండి ప్రభ నుండి ప్రారంభించారు. ఈ బండి ప్రభపై మహిషాసుర మర్దిని పోస్టర్ చూపరులను ఆకట్టుకుంది. గురువారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు రామాలయం వద్ద జరగనున్నాయి. శుక్రవారం ఏడు స్టేజి ప్రోగ్రాములు ఏర్పాటు చేస్తారు. గ్రామం నలుమూలల లైటింగ్, విద్యుద్దీకరణ ఏర్పాటు చేశారు. ఈ మూడు రోజులు రాత్రులు సాంఘిక నాటకాలు ప్రదర్శిస్తారు. శనివారం చివరి రోజున కొండపైన ఉన్న గౌరమ్మను కోనేరులో నిమజ్జనం ఘనంగా నిర్వహిస్తారు.



తరలి వచ్చిన జనం

ధాన్యం కొనలేదని రైతుల నిరసన



మిల్లు దగ్గర నిరసన తెలుపుతున్న రైతులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉమాక పంచాయతీ మనబాలవానిపాలెం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న రైస్ మిల్లులో రైతు భరోసా కేంద్రాల నుంచి తెచ్చిన ధాన్యాన్ని నిర్వాహకుడు తీసుకోవడం లేదంటూ నక్కపల్లి, ఎలమంచిలి మండలాలకు చెందిన పలువురు రైతులు బుధవారం రాత్రి మిల్లు వద్ద నిరసన తెలిపారు. అధికారులు ధాన్యం నాణ్యత చూసి పంపిస్తే రైస్ మిల్లు నిర్వాహకుడు ధాన్యం తేడా ఉందని సరకు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులు మిల్లు నిర్వాహకుడుకు చెప్పినా పట్టించుకోలేదని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు నారాయణరావు, ములినాయుడు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, రమణ, బాబు, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి సిబ్బందిపై ఎమ్మెల్యే బాబూరావు అసహనం

ప్రజాశక్తి -నక్కపల్లి :నక్కపల్లి సిహెచ్‌సిలో బుధవారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు డాక్టర్స్, స్టాఫ్ తో సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సమావేశానికి హాజరవ్వగా, డాక్టర్స్, స్టాఫ్ పూర్తిగా రాలేదు. ఎందుకని అడిగితే వాళ్ళు డ్యూటీలో ఉన్నారని ఆసుపత్రి సూపరింటెండ్ జనార్దన్ బదులిచ్చారు. దీంతో ఎమ్మెల్యే బాబూరావు తన పట్ల గౌరవం లేదని, సరిగ్గా పట్టించుకోలేదని అసం తృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి ఎవరు రానప్పుడు ఇంకెందుకు మీటింగ్ పెట్టుకోవడం తాను తర్వాత ఎప్పుడో వస్తాను అనుకుంటూ జనార్దన్ పై అసహనం వ్యక్తం చేసి ఆసుపత్రి నుండి బయటకు వచ్చి వెళ్ళిపోయారు.



ఆస్పత్రి నుంచి బయటికి వస్తున్న ఎమ్మెల్యే



సర్వే చేస్తున్న అధికారులు, నేతలు

పి.కొత్తపల్లిలో డ్రోన్ సర్వే

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో పి.కొత్తపల్లి గ్రామంలో బుధవారం రెవెన్యూ అధికారులు డ్రోన్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ ప్రసాద్ మాట్లాడుతూ, పి.కొత్తపల్లి గ్రామంలో సుమారు 3000 ఎకరాలకు డ్రోన్ సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. రైతులంతా సర్వేకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజు, వైసిపి నాయకులు శ్రీనివాస్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలోని చిన్న గుమ్ములూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు, మహిళ సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ప్రకృతి వ్యవసాయ విధానంపై వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ రామ గోవిందు, రాము, లావణ్య, కాసులు పాల్గొన్నారు..



ర్యాలీ చేస్తున్న సిబ్బంది



హాజరైన కూలీలు

ఉపాధి హామీతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి -రావికమతం :ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ పనులను సద్వినియోగం చేసుకోవాలని కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారి వరహాలు తెలిపారు. కవగుంట గ్రామంలో ఉపాధి కూలీలతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన రోజువారి వేతన కూలి రూ.257 ప్రతి ఒక్కరూ పొందేలా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం ఏడాదికి 100 రోజుల పని కల్పిస్తుందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మట్టి రోడ్లు, పంట కాలువలు, బౌండరీ ట్రెంచెస్, ఫారం పాండ్స్, భూమి చదును, మొక్కల పెంపకం, చెరువుగట్టుపై కొబ్బరి, మామిడి మొక్కల సాగు తదితర అభివృద్ధి పనులు చేసుకోవాలని సూచించారు. మెటీరియల్ నిధుల కింద పంచాయతీకి ప్రత్యేక సొమ్మును ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. ఆ సొమ్మును సిసి రోడ్లు, డ్రైన్లు, బిల్డింగ్స్, కల్వర్టులు, చెక్ డ్యాములు, తదితర పనులన్నింటికి ఉపయోగించు కోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మోహన్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

లీడ్ బ్యాంకు మేనేజర్ల సమావేశం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల సమావేశం మందిరంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో లీడ్ బ్యాంకు మేనేజర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ, 87శాతం వ్యవసాయ రుణాలు అందజేసినట్లు తెలిపారు. పలువురు బ్యాంక్ మేనేజర్లు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో అందజేస్తున్న డ్వాక్రా రుణాలకు సకాలంలో చెల్లించి పొందాలన్నారు. అదేవిధంగా అర్హత గల రైతులకు రబీ రుణాలు అందజేయాలని బ్యాంకర్లకు సూచించారు.వడ్డీ రైతులకు సకాలంలో తీసుకున్న రుణాలు చెల్లించి రాయితీ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాహకులపై కేసు నమోదు

సిఐ సయ్యద్ ఇలియాస్ అహ్మద్

ప్రజాశక్తి -రావికమతం:గొంప గ్రామంలో గ్రామ దేవత పండగ సందర్భంగా మంగళవారం అశ్లీల నృత్యం ఏర్పాటు చేసిన నిర్వాహకులపై కేసు నమోదు చేశామని కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ అహ్మద్ తెలిపారు. రావికమతం పోలీస్ స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలో



టి.అర్జాపురం గ్రామానికి చెందిన చంద్రరావు అశ్లీల నృత్యం ఏర్పాటు చేశారన్నారు. అతనికి సహకరించిన కాంట్రాక్టర్ సత్తిబాబు, మట్ట చిరంజీవిల పై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. గ్రామదేవతల పండగలకు సాంఘిక నాటకాలు, బుర్రకథలు, సాంప్రదాయ నృత్యాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చట్ట విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు ఆయన హెచ్చరించారు. పేకాట, గుళ్ల ఆటలు, కోడి పందాలు తదితర జూదాలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సిఐ హెచ్చరించారు.

రాజ్యసభ

అధ్యక్ష పీఠంపై విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో : రాజ్యసభ సభ్యునిగా 2019లో ఎంపికైన విజయసాయిరెడ్డికి బుధవారం ప్యానల్ వైస్ చైర్మన్‌గా అధ్యక్ష పీఠంపై కూర్చునే అవకాశం లభించింది. అధ్యక్ష పీఠంపై కూర్చొన్న విజయ సాయిరెడ్డి సభా కార్యకలాపాలను సజావుగా నడిపించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో జరిగిన చర్చలో పలువురు ఎంపీలకు మాట్లాడే అవకాశం కల్పించారు. అంతకు ముందు గత ఏడాది ఆగస్టులో జరిగిన వర్షాకాల సమావేశాల్లో విజయసాయిరెడ్డి మొట్టమొదటి సారిగా అధ్యక్ష పీఠంపై కూర్చునే అవకాశం దక్కించుకున్నారు.



తోపుడు బండ్లు తొలగింపు ఆపాలి : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జి 20 గ్లోబల్ సమ్మిట్ పేరుతో తోపుడుబండ్లు, చిరువ్యాపారులను తొలగించే చర్యలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద టిడిపి నిరసన తెలిపింది. ఈ సందర్భంగా టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, టిడిపి హయాంలో ఫ్లీట్ రివ్యూ సందర్భంగా మత్స్యకారులు వేటకు వెళ్ళొద్దని చెప్పిన సమయంలో వారికి జీవన భృతి ఇచ్చామన్నారు. జి-20 సదస్సులకు తాము వ్యతిరేకం కాదని, ఆ పేరుతో తొలగించిన వారికి జీవనభృతి కల్పించాలని కోరారు. సదస్సు తర్వాత తొలగించిన వారికే మళ్లీ అవకాశం కల్పించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి మాట్లాడుతూ, సదస్సు తర్వాత ఆ స్థలాలను అమ్ముకోవాలని వైసిపి నాయకులు చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి భీమిలి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి నజీర్, చిక్కాల విజయ్, నాయకులు వివిఎన్.మూర్తియాదవ్, లొడగల కృష్ణ బొండ జగన్, గొలగాని మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

బీచ్ ట్యాక్స్ రద్దుచేయాలని జనసేన నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రుషికొండ బీచ్ ప్రయివేటీకరణ, బీచ్ ట్యాక్స్ రద్దుచేయాలని, ముడసర్లోవ పార్క్‌ను పిపిపి పేరుతో ప్రయివేటుకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మాట్లాడుతూ, విశాఖ నగరాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పి, రుషికొండ బీచ్‌ను ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టడం దారుణమన్నారు. బీచ్‌లో ప్రవేశానికి టిక్కెట్లు పెట్టి ప్రజలను దోచుకోనున్నారని తెలిపారు. మత్స్యకారులు, సందర్శకులు రుషికొండ బీచ్‌లో సేద తీరాలంటే ఎంట్రీ ఫీజు చెల్లించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ముడసర్లోవ పార్కును పిపిపి పేరుతో వైసిపి నేతల బినామీలకు అప్పగించేందుకు జివిఎంసి కౌన్సిల్‌లో ఆమోదింపజేసుకున్నారని మండిపడ్డారు. పీల్చే గాలి, తాగే నీరు, కూర్చునే నేలపై కూడా జగన్ పన్నులు వేస్తారని ఎద్దేవా చేశారు. ప్రజల ఆస్తులైన బీచ్‌లు, పార్కులను కాపాడుకోవడానికి జనసేన పార్టీ తరపున పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కార్పొరేటర్లు భీశెట్టి వసంతలక్ష్మి, కందుల నాగరాజు, దల్లి గోవింద్, జనసేన నాయకులు పంచకర్ల సందీప్, మూగి శ్రీనివాసరావు, పసుపులేటి ఉషాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో అంగన్వాడి ఆయా నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఓ మేరీ సువార్త ప్రకటనలో పేర్కొన్నారు. వివాహితులైన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థిని వయస్సు 21 సంవత్సరాల నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలని ఆమె తెలిపారు. స్థానిక వార్డుకు చెందిన ఎస్సీ కేటగిరీకి చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఈనెల 13వ తేదీ. సాయంత్రం ఐదు గంటల లోపు కార్యాలయంలో అందజేయాలన్నారు.

అర్చకునిపాలెం ఘటనలో బాధ్యులపై చర్యలు

ఆర్‌జెడి జ్యోతీకుమారి

ప్రజాశక్తి-పద్మనాభం: మండలంలోని అర్చకునిపాలెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం భవనం పైకప్పు పెచ్చులు పడి ముగ్గురు విద్యార్థులు గాయపడిన ఘటనపై సంబంధిత విద్యాశాఖాధికారులు స్పందించారు. బుధవారం ఆర్‌జెడి జ్యోతికుమారి, డిఇఒ ఎల్.చంద్రకళ, జిసిడిఒ కాలే బేగం పాఠశాలను సందర్శించి, పాఠశాల ప్రాంగణంలోని రెండు తరగతి గదులను పరిశీలించారు. సంఘటనపై హెచ్‌ఎం సిహెచ్.సోములు, ఇతర సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఈ ఏడాది నాడునేడు నిధులు రూ.12లక్షలతో పాఠశాలలో మరమ్మతు పనుల చేస్తున్నామని, ఒక తరగతి గదిలో పనులు పూర్తి కావడంతో వసతి లేమిసమస్య వల్ల ఆ గదిలో తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. అదే గదిలో పెచ్చులు పడడంతో ముగ్గురు విద్యార్థులకు గాయాలు కాగా, తలపై తీవ్రగాయమైన తాలాడ వేదశ్రీ విజయనగరం మహారాజా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వివరించారు.దీనిపై ఆర్‌జెడి జ్యోతికుమారి స్పందిస్తూ, నాడునేడు పనుల్లో నాణ్యతాలోపం వల్లే ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా స్పష్టమౌతోందని, బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు సిఫార్సు చేస్తామన్నారు. అంతవరకు పాఠశాల పక్కనే ఉన్న ఇంట్లో తరగతులు నిర్వహించాలని హెచ్‌ఎంకు సూచించారు. ఎంఇఓ శివరాణి పాల్గొన్నారు.

గాయపడిన చిన్నారికి రాజబాబు ఆర్థికసాయం

ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు గాయపడిన ఘటన సమాచారం తెలుసుకున్న టిడిపి భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు బుధవారం పాఠశాలను సందర్శించారు. ఘటనపై ఆరా తీశారు. హెచ్‌ఎంసోములు, డిఇఒ చంద్రకళతో మాట్లాడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తన వంతు బాధ్యతగా గాయపడిన చిన్నారి తాలాడ వేదశ్రీకి రూ.ఐదు వేల ఆర్థికసాయాన్ని అందించారు. మండల పార్టీ అధ్యక్షుడు కె.రమణ, మాజీ జెడ్‌పిటిసి కె.దామోదరరావు పాల్గొన్నారు.

పర్యవేక్షణా లోపం వల్లే నాసిరకపు పనులు : సిపిఎం

అర్చకునిపాలెం పాఠశాలల్లో నాడునేడు పనులు నాసికరంగా జరగడానికి అధికారుల పర్యవేక్షణాలోపమే కారణమని సిపిఎం నేతలు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, రవ్వ నరిసింగరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పాఠశాలను సందర్శించారు. బాధిత విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. నాడునేడు పనుల్లో నాణ్యతాలోపంతో ఇటువంటి ఘటనకు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.



పాఠశాలను సందర్శిస్తున్న ఆర్‌జెడి జ్యోతీకుమారి

'చలో ఢిల్లీ' జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌ను వందశాతం వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా ఏప్రిల్ మొదటి వారంలో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. బుధవారం ఉక్కునగరంలోని స్టీల్ సిఐటియు కార్యాలయంలో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఉక్కు ప్రయివేటీకరణపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చే క్రమంలో గతనెల 30న నిర్వహించిన ప్రజాగర్జన సభలో ఐదు తీర్మానాలను ఆమోదించామన్నారు. రాష్ట్ర ఎంపిల మద్దతు కూడగట్టుకుని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలంటే కొన్నాళ్లపాటు కార్మికసంఘ నేతలు ఢిల్లీలోనే ఉండి తగు చర్యలు చేపట్టేలా కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ నూతన వేతన ఒప్పందం అమలు చేయకుండా కార్మికుల సహనాన్ని పరీక్షించేలా స్టీల్ యాజమాన్యం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ సమయంలో స్టీల్ సిఐటియు, గుర్తింపు సంఘం దీక్షలతో తమ నిరసనను తెలియజేశారని గుర్తు చేశారు. స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాలతో చర్చల్లో స్టీల్ యాజమాన్య వైఖరి స్పష్టమైనందున ఐక్య పోరాటాలను నిర్మించి ప్రతిఘటించడమే మార్గమని సూచించారు. ఆ దిశగా కార్మిక వర్గాన్ని సమాయత్తపరిచి, పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఋ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం శ్రీనివాస్, స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, బి అప్పారావు, యు వెంకటేశ్వర్లు, బిఎన్ మధుసూదన్, పుల్లారావు, టివికె రాజు, గంగాధర్, నీలకంఠం, శశిరెడ్డి, కె బాలశౌరి, బి మహేష్, డి.సత్యనారాయణ, ఎంఎస్‌వి ఉమామహేశ్వరరావు, దేముడు నాయుడు, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, స్టీల్ సిఐటియు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షుడు అయోధ్యరాం

బిటెక్ విద్యార్థి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -పాయకరావుపేట: మండలంలోని పెద్దూరు సముద్ర తీరంలో సోమవారం సాయంత్రం సముద్రంలో గల్లంతైన బిటెక్ విద్యార్థి గుమ్మడి రిత్విక్ మృతదేహం బుధవారం పెద్దూరు సముద్ర తీరంలో లభ్యమైనట్లు పాయకరావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ పాలిన అప్పలరాజు తెలిపారు. కాకినాడ పట్టణంలో మధుర నగర్ కాలనీకి చెందిన రిత్విక్ స్నానం చేస్తుండగా సముద్రంలో సోమవారం గల్లంతయినట్లు విషయం తెలిసిందే. మృతుడు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించిన పాయకరావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ పాలిన అప్పలరాజు పోలీస్ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్సై జోగారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

11నుంచి కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీ పరిధి దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 11వ తేదీ నుండి 13వ వరకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈనెల 11న గణేష్ పూజతో ప్రారంభమై 12న ఉదయం పల్లకి సేవ, సాయంత్రం శివపార్వతుల కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. 13న మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం మహా పుష్పయాగం నిర్వహిస్తామన్నారు.

రోడ్డుకు రూ. 5కోట్ల నిధులు మంజూరు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పాయకరావుపేట : నియోజకవర్గ కేంద్రమైన పాయకరావుపేట పట్టణం మెయిన్ రోడ్డుకు ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డిఓ) సిహెచ్ జయరాం తెలిపారు. బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ఈ మేరకు రోడ్డు పక్కన చిల్లర వర్తక వ్యాపారస్తులు సహకరించాలన్నారు. రోడ్డు వేయించిన తర్వాత మళ్లీ యధావిధిగా రోడ్డుకు ఇరుపక్కల చిల్లర వర్తక వ్యాపారులు దుకాణాలతో వ్యాపారం చేసుకోవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు. ఏమైనా సమస్యలుంటే స్థానికులతో చర్చించుకుని వివాదాలకు తావు లేకుండా పరిష్కరించే విధంగా చూసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. త్వరగా పనులను ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న గాయత్రిదేవి

గొర్రెలు, మేకలకు టీకాలు

ప్రజాశక్తి - చీడికాడ: మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో పశు వైద్య సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి మూడు నెలలు వయసు దాటిన గొర్రెలు, మేకలకు పిపిఆర్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. సుమారు 150 మూగ జీవాలకు పిపిఆర్ వ్యాధి నిరోధక టీకాలు వేశామని చీడికాడ పశు వైద్య సహాయ శస్త్ర చికిత్సకులు డాక్టర్ జి.గాయత్రి దేవి తెలిపారు. మండలంలో ఇంతవరకు 1142 జీవాలకు పి.పి.ఆర్. వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని కాగిత గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ సందీప్ బుధవారం పరిశీలించారు. చెరువు అభివృద్ధి పనులు, చెరువుగట్టు పై మొక్కల పెంపకం వాటి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో అమృత సరోవర్ పథకం కింద 122 చెరువులకు గాను 65 పూర్తి చేసామన్నారు. కొత్తగా మరిన్ని చెరువులను తవ్విస్తున్నామని, ఒక్కో దానికి రూ.20 నుంచి 24 లక్షల వరకు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. చెరువుల ద్వారా భూగర్భ జలాలను పెంచడంతో పాటు మూగజీవాలకు నీటిని అందించడం లక్ష్యమన్నారు. ఈ ఏడాదిలో కోటి పని దినాలుగాను 88 లక్షలు పూర్తి అయ్యాయని, ఇందుకోసం సుమారుగా 173 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. రానున్న సంవత్సరానికి కోటి యాభై లక్షల పని దినాలు చేయాలనేది లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేష్, ఉపాధి ఏపీడి శ్రీను, ఏపీఓ ఈశ్వరరావు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న పీడీ